# డబ్బుతినే మనిషి

గోవిందయ్య ఆ చిన్న పెంకుటింటి ముందు ఆగి ఒక్కక్షణం అలుపు తీర్చుకున్నాడు. నెత్తిమీద గొడుగు నెమ్మదిగా ముడిచి చంకన పెట్టుకున్నాడు. భుజం మీద కండువాతో ముఖానికి పట్టిన చెమటను అద్దుకున్నాడు. తన దళసరి కళ్ళద్దాలు సవరించుకుంటూ ఆ యింటిని, గోడల్ని మరోసారి పరిశీలించి, తను వచ్చింది వరదరాజులు ఇంటికే అని, నిర్ధారించుకున్నాడు.

"వరదరాజులూ!" గోవిందయ్య గొంతెత్తి గట్టిగా పిలిచాడు. ఆ యింట్లోంచి బదులు రాలేదు. గోవిందయ్య ఒక అడుగు ముందుకువేసి, రెండు మెట్లు ఎక్కి అరుగుమీద చతికిలపడ్డాడు. లోపల ఎవరో ఉన్నట్టు సందడిగానే ఉంది. మాటలు వినబడుతున్నాయి. ఎవరూ పలకరేమిటి?

"వరదరాజులూ!" గోవిందయ్య సందేహంగా మళ్ళీ పిలిచాడు.

గోవిందయ్య పిలుపుకు ఈ సారి ఇంట్లోంచి పదేళ్ళ కుర్రాడు బాణంలా దూసుకువచ్చాడు.

" బాబూ!నువ్వు వరదరాజులుగారి అబ్బాయి వేనా!" గోవిందయ్య అడిగాడు.

" అవునండీ!" ఆ కుర్రాడు సమాధానం చెప్పాడు. " మీ నాన్న ఉన్నాడా... ?"

గోవిందయ్య ప్రశ్నకు, ఆ కుర్రాడు జవాబు చెప్పలేదు. గిర్రున వెనక్కితిరిగి లోపలికి పోయాడు. గోవిందయ్య ఉస్సూరంటూ నిట్టూర్చాడు. ఒక చేతిలోని గొడుగు, మరో చేతిలోని వెడల్పాటి తోలు సంచీ తన ప్రక్కనే పెట్టుకున్నాడు. చొక్కా పక్క జేబులోంచి నశ్యం డిబ్బీ బయటకు తీసుకున్నాడు. సావధానంగా ఓ పట్టు దట్టించి, తృప్తిగా లోపలకు ఎగబీల్చాడు. ఆ పై ఆ యింటి పెంకులు అదిరిపోయేలా ఓ తుమ్ము తుమ్మనే తుమ్మాడు.

" ఎవరండీ మీరు?" సన్నటి యువకుడు లుంగీతో గుమ్మం దగ్గరకొచ్చి గోవిందయ్యను పలకరించాడు. .

" బాబూ! నా పేరు గోవిందయ్య. మాది తిమ్మాపురం.... వరదరాజులుతో చిన్నపని ఉండి వచ్చాను. వాడిదీ నాదీ చిన్ననాటి స్నేహంలే."

"ఆయన మా నాన్నగారేనండి...."

"అలాగా బాబూ ! చాలా సంతోషం... ఏదీ మిమ్మల్ని ఎప్పుడూ చూడటం పడలేదు... సరే! మీ నాన్నని ఒక సారి పిలునాయనా!" గోవిందయ్య భారంగా గోడకు చేరగిలపడ్డాడు.

ఆయువకుడు గబగబ లోపలికి వెళ్ళాడు. వెళ్ళినంత వేగంగా తిరిగివచ్చాడు. అతని చేతిలో ఓ గాజుగ్లాసు వుంది. ఆ గ్లాసులో పల్చటి మజ్జిగ ఉంది. గోవిందయ్య మజ్జిగ గడగడా త్రాగాడు..... !

"మా నాన్నగారు లేరండీ?" ఏదో అపరాధిలా ఆ యువకుడు తలవంచుకుని అన్నాడు.

" ఎక్కడికెళ్ళాడు బాబూ వాడు? ఎప్పుడొస్తాడు?" "ఆయన రారండి! మూడు

రోజులయిందండి ఆయన పోయి.." ఆ యువకుడు కంఠం కొద్దిగా వణికింది.

" వరదరాజులు పోయాడా? ఎక్కడికి? " గోవిందయ్యలో అనుమానం తీరలేదు. గుండె గుబగుబలాడింది.

" నిజమేనండి... నాన్నగారు చనిపోయి మూడు రోజులు..." ఆ యువకుడి మాటలు పూర్తికాలేదు. గోవిందయ్య 'ఆ' అంటూ నోరు తెరిచాడు. గుండెల మీద రెండు చేతులతోనూ దబ్‌దబ్‌మంటూ బాదుకున్నాడు. " ఎంత పని జరిగింది బాబూ... ఎంత ఘోరం జరిగిపోయిందీ" అంటూ ఆ యువకుడి చేతుల్ని పట్టుకుని ఊపేశాడు. తనూ దు:ఖోద్వేగంతో ఊగిపోయాడు. విలవిలలాడుతూ సుళ్ళు తిరిగే కన్నీళ్ళను కండువాతో ఒత్తుకోసాగాడు.

"తండ్రి వరదరాజులుకీ, ఈయనకూ మధ్య ఎంత స్నేహానుబంధం ఉందో... ఆత్మీయుడ్ని కోల్పోయిన దు:ఖంలో ఎంత బాధపడుతున్నాడీయన...!'

వరదరాజులు కొడుకు, దిగ్భ్రమలో గోవిందయ్యనే చూస్తున్నాడు. గోవిందయ్య విలవిలలాడుతూ బాధపడటం.. వీధిలో కొంతమంది ఆగి వింతగా చూడసాగారు... ఇంట్లోంచి బంధువులూ గుమ్మం దగ్గరకొచ్చి, చనిపోయిన వరదరాజులు గుర్తుకు రాగా దు:ఖాతిశయంతో వెక్కి వెక్కి పడుతున్నారు.

"బాబూ ! నీ పేరేమిటి నాయనా...?" గోవిందయ్య గద్గదస్వరంతో అడిగాడు. " నా పేరు సుందరం అండీ!"

"చూడు సుందరం! మీ నాన్న ఆర్నెల్ల క్రితం నా దగ్గర అయిదువేలు అప్పు తీసుకున్నాడు. అదీ మీ చెల్లెలు పెళ్ళి సందర్భంలోనే... ఆ బాకీ గుర్తు చేద్దామనే వచ్చాను బాబు! ఇదిగో నోటు పత్రం...."

గోవిందయ్య కంగారుగా తోలు సంచీలోంచి నోటు పత్రం తీసి సుందరం చేతిలో పెట్టాడు. సుందరం నిరుత్తరుడయ్యాడు. నిర్లిప్తంగా ఆ నోటు అందుకున్నాడు. ఆ నోటు నిజమైనదే.... అందులో సంతకం.... వరదరాజులుదే... కూతురు పెళ్ళి నిమిత్తం మూడు రూపాయల వడ్డీ చొప్పున... అయిదువేలు తీసుకున్నట్టు ఎవరెవరివో సాక్ష్యుల సంతకాలూ ఉన్నాయి.

"వేరే దారిలేదంటూ ఎంతో ప్రాధేయపడితే ఆ సొమ్ము ఇచ్చాను బాబూ! ఆ డబ్బు కూడా నాది కాదు... ఇంట్లో నాకిన్ని మెతుకులు వండి పడేస్తున్న దూరపు బంధువు రాజమ్మది. అదెప్పుడో ముండమోసినప్పుడు దానికి అత్తవారిచ్చిన భరణం సొమ్మది... ఆ రాజమ్మకు నేనిప్పుడు జవాబేం చెప్పాలి బాబూ? ఏం చెప్పాలి....?" గోవిందయ్య లబోదిబోమంటున్నాడు.

సుందరానికి మతిబోయినట్టయ్యింది. గోవిందయ్యకు ఏం చెప్పాలో పాలుపోలేదు.

తండ్రి వరదరాజులు అమాయకుడు. అందరిలో మంచివాడుగా పేరు తెచ్చుకున్నాడు. కుటుంబ అవసరాల కోసం దొరికిన చోటల్లా అప్పులు చేయడం ఆయన అలవాటు. ఇంట్లో ఇబ్బంది పడడం అనే పరిస్థితి రానిచ్చేవాడు కాదు. చెల్లెలు పెళ్ళి సందర్భంలో కూడా ఆఫీసు నుంచి ఎక్కువ మొత్తంలోనే లోన్ తీసుకున్నాడు. పైగా ఈ పెద్దమనిషి దగ్గర అయిదువేలు అప్పు తీసుకోవడం తనకు తెలియనే తెలియదు. పోనీ అమ్మకు తెలుసా?

సుందరం రెండు అంగల్లో లోపలిగదిలోకి వెళ్ళాడు. తల్లిని తట్టి లేపి విషయం అడిగాడు. ఆమె తుళ్ళిపడి లేచింది. తనకు తెలియదంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆపై భర్త చేసిన అప్పుల్ని తలచుకుంటూ గొల్లున ఏడవసాగింది.

సుందరం వీధి గదిలోకి వచ్చాడు. తన చేతిలో ఉన్న నోటుపత్రం తిరిగి గోవిందయ్యకిచ్చాడు.

" గోవిందయ్యగారూ! పరిస్థితులు మీకు తెలియనివి కావు... నాన్నగారు చాలా అప్పులు చేశారు. నాకా ఉద్యోగం లేదు. చిన్నా పెద్దా ఎనిమిది కంచాలు లేవాలి. కుటుంబం ఎలా గడుస్తుందో తలచుకుంటే భయం వేస్తోంది. ఈ పరిస్థితిలో..."సుందరం మాటలు దు:ఖంతో పూడుకుపోయాయి.

" మీ కుటుంబానికేమీ ఫరవాలేదయ్యా... నా బాకీ సంగతేమిటి? మీ నాన్న ఉద్యోగం నీకు గ్యారంటీ. పి.ఎఫ్. గ్రాట్యుటి, ఇన్సూరెన్సూ వగైరా మొత్తం కలిపి పెద్ద మొత్తమే మీకు అందుతుందయ్యా....."

గోవిందయ్య వీధిలో పోగయిన జనాలందరికి గొంతు వినబడేలా చెబుతున్నాడు. వరదరాజులు తన ఇంటికి ఎన్నిసార్లు తిరిగింది, ఎలా ప్రాధేయపడిందీ, ఆర్నెల్లుగా ఎలా కనిపించకుండా పోయిందీ సాగదీసుకుంటూ బాధపడిపోతున్నాడు. కొందరు ఆ కుటుంబం మీద సానుభూతి చూపుతున్నారు. మరికొందరు మీ బాకీ ఎక్కడకు పోతుందన్నట్లుగా గోవిందయ్యకు ధైర్యం చెబుతున్నారు. వరదరాజులు ఇంటికి వచ్చిన బంధువులూ తమలో తాము గుసగుస లాడుకుంటున్నారు. గోవిందయ్య స్థిమితపడటం లేదు... బాకీ గురించి తెగ ఆరాటపడిపోతున్నాడు.

" మీ బాకీ ఎంతో కొంత తీరుస్తామండీ. మీరేమీ బెంగపెట్టుకోవద్దు" తల్లితో మరోసారి మాట్లాడి వచ్చి సుందరం గోవిందయ్యతో అన్నాడు.

" ఎంతో కొంతంటే కుదరదు బాబూ! అనుకున్నట్టుగా అయిదువేలూ వడ్డీతో సహా నా బాకీ తీర్చేయాలి. అదీ ఒక నెలరోజులలోగా.... లేకపోతే చాలా సమస్యలు వచ్చిపడతాయి..." గోవిందయ్య నోటు భద్రంగా తోలుసంచీలో పెట్టుకున్నాడు.

" అలాగేనండి! నాన్నగారి డబ్బు చేతిక రాగానే..." గుండెల్లో ఏదో తెలియని బాధ కలవరపెడుతూంటే బెంగగా భరోసా ఇచ్చాడు సుందరం. అదిగో అప్పుడుగోవిందయ్య అరుగు దిగాడు. బాకీ గురించి పదేపదే నొక్కి చెప్పి వీధిలో - వడివడిగా నడిచి ముందుకు పోయాడు.

సుందరానికి ఎవరో గుండె పిండుతున్నట్టుగా ఉంది. భయంగా ఉంది... ఏదో అగాధమైన లోయలోకి జారిపోతున్నట్టుగా ఉంది...,.. విషసర్పాలేవో బుసలు కొడుతూ తనను చుట్టేస్తున్నట్లుగా ఉంది. తండ్రి వరదరాజులు అన్ని చోట్లా అప్పులు చేశాడు. అందరూ వచ్చి బాకీలు తీర్చమంటూ రాబందుల్లా పొడుచుకుతింటున్నారు. ఆ కంపెనీవాళ్ళు తండ్రి తరపున ఎంత ముట్టచెబుతారో...? తండ్రి ఉద్యోగం తనకు ఇస్తారో ... ఇవ్వరో... ? ఇస్తే ఎంతకాలానికి ఇస్తారో ...? ఆవచ్చే డబ్బు ఈ బాకీలకే సరిపోతే ఈ సంసారాన్ని ఈదడం ఎలా.. ? ఈ సమస్యల్ని తట్టు కోవడం ఎలా? ఈ బాధల్ని భరించడం ఎలా.. ? ఏమిటి చెయ్యడం? ఏదీ దారీ...?

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. ఎండ ఫెళ్ళున కాస్తోంది. ఆ ఎండలో గొడుగులో

వడివడిగా నడుస్తూ గోవిందయ్య ఒక ఎత్తైన ప్రహారీగేటు దగ్గర ఆగాడు. ఆ గేటుపైన పెద్ద బల్ల చెక్కబోర్డు మీద అక్షరాలను పరీక్షగా చదివాడు. గేటు దగ్గర గూర్ఖా, గోవిందయ్యను ఆపాడు. గోవిందయ్య గూర్ఖాతో తను వచ్చిన పని చెప్పాడు. జేబులోంచి నశ్యం డిబ్బీ తీసి తను ఓ పట్టుపట్టి గూర్ఖా చేతిలో కాసింత నశ్యం వేసి లోపలికి పీల్చమన్నాడు. గూర్ఖా సలాము చేస్తూ గోవిందయ్యను లోపలికి పంపించాడు.

గోవిందయ్య మరో పది నిముషాల తరువాత ఆ కంపెనీ ఎమ్.డి. ముందు కుర్చీలో కూర్చున్నాడు. ఆ ఎమ్.డి. గారు అప్పుడే తీరిగ్గా టిఫిన్ బాక్సు తెరుచుకుని ఫలహారం చేస్తున్నాడు.

“ చెప్పండి! ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?” ఎమ్.డి. నవ్వుతూ అడిగాడు. గోవిందయ్యకు ఏనుగెక్కినంత గర్వం.... ఆనందం కలిగాయి!

“ అయ్యా! నా పేరు గోవిందయ్య, మాది తిమ్మాపురం... మీతో చిన్న విషయం మనవి చేసుకుందామని వచ్చాను. మొన్న మొన్ననే కాలం చేసిన మీ కంపెనీ గుమాస్తా వరదరాజులు నా స్నేహితుడు. ఏదో ఆపదలో వున్నాడని అయిదువేల రూపాయలు అప్పుగా ఇచ్చాను. వాడేమో చెప్పా చెయ్యకుండా గుటుక్కుమన్నాడు. ఇదిగో అప్పు పత్రం. సొమ్ము మీరు నాకు ఎలాగైనా ఇప్పించాలి. ఏదో పెద్దవాడ్ని” గోవిందయ్య ప్రాథేయపడుతూ రెండు చేతులూ జోడించాడు. ఎమ్.డి. ఏమనుకున్నాడో గాని అతని భృకుటి ముడిపడింది. ముఖంలో రంగులు మరాయి. టేబిలు మీద బజరు నొక్కాడు...

అటెండరు లోపలికి వచ్చాడు.

“ చూడండి గోవిందయ్యగారూ! ఇలాంటి విషయాలు నా దగ్గర మీరు చెప్పకూడదు. ఆ అప్పు విషయం మీరూ మీరూ చూసుకోండి... వెళ్ళండి!” ఎమ్.డి. కటువుగా, చాలా ఖచ్చితంగా అని ముఖం అటు తిప్పుకున్నాడు. గోవిందయ్యకు లేవక తప్పలేదు. తన బాకీ సంగతి ఎమ్.డి. దృష్టికి కూడా తీసుకువస్తే త్వరగా వసూలవుతందని భావించాడు. కాని ఫలితం దక్కలేదు.

గోవిందయ్య నిరాశపడలేదు. ఎమ్.డి. గదిలోంచి బయటకు వచ్చాడు. కంపెనీ ఆవరణ దాటాడు. రోడ్డెక్కాడు. వరదరాజులు బాకీ గురించి ఏవో పథకాలు వేసుకున్నాడు. రోడ్డు మీద కనిపించిన ముఖ పరిచయం ఉన్న వాళ్ళందంరితోనూ తన గోడు చెప్పుకున్నాడు... గోవిందయ్య మనసు కుదుటపడలేదు. ఆరాటం తగ్గలేదు. వరదరాజులు బాకీ ఒక్కటే అతని ఆలోచనల్లో ఉండిపోయింది.

గోవిందయ్యకు ఆ పూట ఏ పనీ చెయ్యబుద్ధి కాలేదు. తిన్నగా బస్టాండుకు నడిచాడు. గోవిందయ్య ఉండే తిమ్మాపురం ఆ టౌనుకు తొమ్మిది మైళ్ళ దురంలో ఉంది. రెండుంపావలా టికెట్టు ముప్పావుగంట ప్రయాణం. రెండు రోజులుకు ఒకసారయినా టౌనుకు వస్తుంటాడు. గోవిందయ్య...! వరదరాజులు హఠాత్తుగా చనిపోవడం గోవిందయ్యకు ఊహించని సంఘటన!

ఆ వరదరాజులు బాకీ గురించి ఆలోచిస్తూ, ఆ ఊరి బస్సుకోసం మూడు గంటలు నిరీక్షించి చివరకు చీకటి పడేవేళకు ఇంటికి చేరుకున్నాడు గోవిందయ్య. అప్పటికే హాల్లో స్టూలుమీద చిన్న కోడిగుడ్డు దీపం కునుకుతీస్తున్నట్టుగా వెలుగుతూంది. వాలుకుర్చీ వాల్చుకుని వీలుగా కూర్చున్నాడు గోవిందయ్య. “రాజమ్మా” అంటూ పిలిచి చంకలోని తోలుసంచీ గచ్చుమీద పెట్టుకున్నాడు.

“ ఆ వస్తున్నా ” అంటూ ఇంట్లోంచి పిలుపు వినబడింది. మరో రెండు నిమిషాల్లో

తెల్లటి చీరలో ఓ నడివయసు స్త్రీ చేతిలో గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి... గోవిందయ్య కూర్చున్న చోట పెట్టింది. రాజమ్మ విధవ స్త్రీ...! పగటిపూట కూడా ఆమె వీధి గుమ్మంలోకి రాదు.... అలా ఆమె రాకపోవడానికి ఊళ్ళో ఉన్న పుకారు ఒకటే కారణం కాదు.

" బాగా చీకటి పడిపోయింది......కాస్త పెందరాళే ఇంటికి వచ్చేయకూడదూ......?" రాజమ్మ భుజం నిండా కొంగు కప్పుకుని గోవిందయ్యను పరామిర్శించింది.

"బస్సు అందలేదు. రాజమ్మా! ఏం చెయ్యను?" గోవిందయ్య విసుగ్గా అన్నాడు. " ఏవిటో! మీ తాపత్రయం మీరూనూ! బాకీ లేమైనా వసూలయ్యాయా...?" ఆమె గుమ్మం దగ్గర చతికిలపడింది.

" బాకీలా ! నా బొందా! ఏదీ ఒక్కడూ కనిపించిచావలేదు" గోవిందయ్య చికాకుపడుతూ కుర్చీలోనే చొక్కా విప్పుకుంటున్నాడు.

" మీకేం తక్కువా...? లంకంత ఇల్లుంది. పొలాలున్నాయి. తినేవాళ్ళు లేరు... ఇద్దరు కొడుకులు, ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ మీ ముఖం చూడరు.... ఇంకా కుదువబెట్టి... అప్పులిచ్చి... తిరిగి ... ఎవరికోసం ఈ హైరానా? ఎవరికోసం ఈ సంపాదన?" రాజమ్మ మాటలకు గోవిందయ్య మాట్లాడలేదు. అతని దృష్టి ఎక్కడో ఉంది.

" ఆ వరదరాజులుకి అప్పు తాలూకు నోటు పత్రం ఇచ్చి వస్తానని వెళ్ళారు... అదైనా అప్పగించి వచ్చారా?"

రాజమ్మ మళ్ళీ అడిగింది..... గోవిందయ్య ఉలిక్కిపడ్డాడు. గొంతుకలో ఏదో అడ్డం పడినట్టయ్యింది. జవాబు చెప్పడానికి ఇష్టంలేనట్టు కుర్చీలో అటూ ఇటూ జరిగాడు.

" ఆ ఆ ఇచ్చానులే! నువ్వు ముందు లోపలికెళ్ళు!" గోవిందయ్య కోపంగాఅన్నాడు.

" పాపం ! ఆ వరదరాజులు వారం రోజుల క్రితం అయిదువేలూ ఇచ్చి వెళ్ళాడు... మీరేమో ఆరోజు చాలాసేపు వెదికి నోటు కనిపించలేదంటిరి.... ఒరేయ్! నువ్వు నా చిన్ననాటి స్నేహితుడివి, నీ నోటు తీసుకొచ్చి భద్రంగా అప్పగిస్తానోయ్ అంటిరి.... సత్తెకాలపు మనిషి కాకపోతే... ఆ వరదరాజులు డబ్బిచ్చి నోటు వదిలేసిపోతాడా?"

"నువ్వు నోర్మూసుకుని లోపలకు వెళ్తావా? లేదా? " గోవిందయ్య గొంతు పెంచి గట్టిగా అరిచాడు.

" వెళ్తాను... వెళ్ళకపోతే ఏం జేస్తాను? దిక్కూ మొక్కూలేనిదాన్ని.. ఏగాణీ విలువ లేనిదాన్ని... మీ పంచన పడున్నదాన్ని... మీ గురించి బాగా తెలిసినదాన్ని కాబట్టి... మంచో చెడో... అలా వాగుతుంటాను" రాజమ్మ సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

'మంచీ,చెడ్డా, మనుషులూ, స్నేహం... ప్రపంచంలో ఏదయినా డబ్బు తర్వాతే...! ఆడబ్బుసంపాదించటంలో ఉన్న ఆనందం... తృప్తీ... తృష్ణా నీకేం అర్థం అవుతాయి రాజమ్మా..... నీకు అర్థం కావు...

గోవిందయ్య తనలో తాను నవ్వుకున్నాడు. వరదరాజులు కుటుంబం నుంచి వసూలు చేయబోయే అయిధువేల రూపాయలూ తలచుకుంటే.... గోవిందయ్యకు ఆ పూట ఆకలి వేయలేదు. ఆ వరదరాజులుకు తృప్తిగా భోజనం చేసి నట్టే అనిపించింది.

గోవిందయ్య బ్రేవుమంటూ త్రేన్చాడు...!

(స్వాతి మాసపత్రిక 29.6.90)

❀ ❀ ❀ ❀ ❀ ❀